# "రెండు రూపాయిలు"

**పురాణం సూర్యప్రకాశరావ్**

కామేశం: పక్కింటావిడ్ని అడిగి రెండు రూపాయిలు పట్రా సాయంత్రం బజారు వెళ్ళాలి.

కాంతం: పక్కింటావిడంటే, మీ ఉద్దేశం ఆవిడ ఇనప్పెట్టనుకున్నారేవిటి తెలియక అడుగుతాను. నే వెళ్లను సుమండీ! చీటికీ మాటికీ చేతులు చాపటం అంటే చచ్చే అభిమానం నాకు.

కామేశం: సరే బాగుంది! ఏంచేస్తాం? ఒకసారి కాకపోతే - పదిసార్లు తిరగాలి. మన అవసరం. నేను పుట్టించటంలా పాలికా పరకా - నిన్న మొన్న నిన్న, ఆ వెధవ గోవిందంగాడ్ని - ఎవడు? కానీకి కక్కుర్తిపడే రకం; అటువంటి వాడ్ని, ఆ ఏబ్రాసిని మాటలతో ములగ చెట్టెక్కించేశాను. అబ్బే! అంతలో లొంగే ఘటంగా కనిపించ లేదు జేబులో ఉన్న అర్ధరూపాయి పెట్టుబడితో కాఫీ హోటల్లో మెక్కబెడితేగాని అయిదు రూపాయిలివ్వటానికి వాడిలి ఆకాశం చూశాడు! అదే నేనైతే విసిరి అవతల పారేసేవాడ్ని. అటువంటివాడ్ని అభిమానం చంపుకోగా లేంది... ఏది? నలుగురుమధ్య తిరిగేవాడ్ని, ఇంట్లో పడుండేదానివి నీ కెందుకీ పాడు అభిమానం. దాన్ని చంపెయ్య అటువంటివి పెట్టుకుంటే సుఖం ఆమడ దూరానికి తప్పుకుంటుంది జీవితంలో. జాగ్రత్త! (గొణుక్కుంటూ) అభిమానంట అభిమానం! ప్రపంచజ్ఞానం బొత్తిగా శూన్యం. జీవితం అంటే అమ్మా నాన్నతో గారాలు పోవటం అనుకుంటోంది, ఏమున్నా లేకపోయినా ఇది మాత్రం పోవదు!

కాం: ఇదిగో ఆ గొణుగుడు వింటేనే ఒళ్లు రగులుకుపోతుంది. మనసులో ఏదో దుఃఖాన్ని అణిచెయ్యరాదూ!

కా: ఏం, అవసరముండి అడిగానో, ఎందుకడిగానో అని ఆలోచించటం పోయింది. 'ఒళ్లు మండుకుపోతుందిట!' వెళ్లి పట్రామన్నందుకు వాగిస్తావు అనవసరంగా.

కాం: నే పట్రాను. నిన్ననే రూపాయివ్వటానికి గునిసిందావిడ. ఏముఖం పెట్టుకుని మళ్ళీ వెళ్లటం?

కా: నిన్న ఈముఖం పెట్టుకునే వెళ్ళినట్టున్నావు అందుకనే గునిసింది. ఇవాళ కోటింగుమీద కోటింగు పౌడరు కొట్టి మరీ వెళ్ళు. పెట్టెలో పెద్దాపురం పట్టుచీర కట్టుకువెళ్లు.

అసలు అప్పుచెయ్యటానికి ఓ పద్ధతి విధానం అంటూ ఏడిశాయి. నీకవి బొత్తిగా తెలియవు. ఓ చిన్న రహస్యం చెబుతాను చూడు. ఉదయం పూట అప్పుకంటూ వెళ్ల కూడదు. ఎందుకల్లంటే అది ఆవిడ వంట చేసుకునే సమయం. ఓ పక్కనించి స్కూళ్ళకెళ్ళవాళ్ళూ, ఆఫీసుల కెళ్ళవాళ్ళ కంగారు పెట్టే సమయం అది. ఆవిడా క్షణంలో మహాంకాళిలా ఏనుగంత బలం తెచ్చుకుని, ఓపిగ్గా ఎంత విసుగుపాటు అతి ప్రయత్నం మీద అణచుకుంటూ ఎక్కడి వాళ్ళ నక్కడికి సాగనంపే సమయం అది.

ఏ ఒంటిగంటకో ఇంటిల్లిపాదీ భోంచేసిం తర్వాత తను నాలుగు మెతుకులు కతికి ఎంగిళ్లు ఏమూర్లు ఎత్తుకుని ఓ నిద్ర తీసిం తర్వాతగాని ఆమె కుదుటబడదు.

కాం: (చిరాగ్గా) ఏవిటీ ఉపోద్ఘాతం.

కా: చెప్తాను విను మరి. ఉపోద్ఘాతం ఏంఖర్మం పెద్ద గ్రంథం రాయాలనుకుంటున్నాను.

కాం: దేన్ని గురించి? అప్పెలా చెయ్యాలన్న దాన్ని గురించేనా?

కా: ఆఁ! ఆఁ! దాన్ని గురించే. రెండొందలపేజీల గ్రంథం తయారవుతుంది. ఖరీదు చాలా అందుబాటులో ఉండాలి లేకుంటే నలుగురూ చదువుకునే అవకాశం ఉండదు. వెధవది రాద్దామనే ఉంది కాని తీరి కెక్కడేడిసింది.

కాం: రాయండి! రాయండి! దేశసేవ చేసినట్టవుతుంది.

కా: ఇంకా నెమ్మదిగా అంటావేవిటి? దేశసేవ కాదు మరి. ఎంతసేపు పేదవాళ్లను ఉద్రేకపరిచి ఊహాలోకాల్లో తిప్పి పారేసిన రచయితలున్నారు గాని వాళ్ళకో మార్గం చూపించిన వాళ్లేరీ? ఇన్నాళ్లకిలోకోద్ధారకుడు ఉద్భవించాడు గాని.

కాం: అవునవును ఇంతవరకెవ్వరూ లేరనే చెప్పాలి.

కా: లేరు కాబట్టే మనం కలం పట్టాల్సిన అవసరం ఒచ్చింది. అవసరం ఒచ్చింది కాబట్టే మనం పేరు ప్రతిష్ఠలు సంపాదించుకునే అవకాశం లభించింది.

కాం: ఆలస్యం అమృతం విషం అన్నారు. కాబట్టి వెంటనే రచన కుపక్రమించండి.

కా: అవును. లేకుంటే కొంప మునిగిపోతుంది. వెధవ ప్రపంచం రోజురోజుకీ మారిపోతోంది. రోజుకో కొత్తరకం సాహిత్యం దిగుతోంది ఏ కుంకో తిక్కన్నా తనకు తట్టిన ఐడియాయే బుర్రలో మెరిస్తే కాగితాలన్నీ గిలికి పారేస్తాడు. అప్పుడు మన విలువ ఏ సుయోగ్య గుయోగ్య చూసుకోవాలి. ఏమంటావు.


కాం: అదే నేనూ అనబోతున్నాను. దానివల్ల కొంత రాబడికూడా ఉంటుంది.

కా: నువ్వు పొరబడుతున్నావ్, ఈ ప్రయత్నంలో ఆర్థికంగా నష్టపోయినా నేను విచారించేది లేదు. దేశానికి అందులో ముఖ్యంగా పేదజనానికి ఎంత ఉపయోగిస్తుందో చూడు. మనక్కావల్సింది అదే.

కాం: పెట్టుబడిదార్ల స్వలాభాలూ, స్వార్థాలూ, వాళ్ల నిరంకుశత్వం మీకు బాగా అనుభవం కాబట్టి మీ రచన అద్భుతంగా ఉంటుంది. చాలా ఉపయోగిస్తుంది.

కా: వాళ్ల స్వార్థం, స్వలాభం గురించి వర్ణించటం కాదు నా రచనోద్దేశం. విభిన్న తత్వాలుగల వ్యక్తులదగ్గిర ఎలా మసులుకోవాలి? ఎలా మసులుకుంటే మన అవసరం గడుస్తుంది. ఇంతవరకే ఆపైన మనకి అనవసరం. వాళ్లెలా ఏడుస్తే ఎవరికి కావాలి?

కాం: ఉదాహరణకి ఒక రకం మనస్తత్వం గల వ్యక్తులతో ఎలా మసులుకోవాలో టూకీగా చెప్పండి. వింటాను.



అగ్నిదేవుడు (భువనేశ్వర్)
—ఫొటో : సుబ్బేశ్వరరావు, (అగ్రహార్)

## ★ "రెండు రూపాయిలు" ★

కా: ఇప్పుడు మన పక్కింటావిడ్ని తీసుకో.

కాం: (కుతూహలంగా) కొంపదీసి ఆవిడతో కూడ మొదలుపెడతావా ఏమిటి గ్రంథం. ఆవిడ పూర్వసువాసిని. అమంగళం!

కా: నీ ముఖం. ఆవిడ పునిస్త్రీ అయితే ఎవరికి కావాలి. పూర్వసువాసిని అయితే ఎవరి కావాలి. ఆవిడ మన సత్యం ఎలాంటిదో తెలియచెయ్యటానికే మన కథ. ఆవిడకి తెల్లవారి లేచింది మొదలు రాత్రి నిద్ర పోయేంతవరకూ క్షణం తీరికుండదు. ఏ నిముషంలో చూసినా శ్రమిస్తూనే వుంటుంది. మహా కష్టజీవి. అయితే ఆవిడదగ్గిర చచ్చేటంత డబ్బు ఇనప్పెట్టెలో మూలుగుతోంది. సాయంత్రం ఏ అయిదింటికో పొయ్యిమీద బియ్యంపడేసి నీబోటివారితో పిచ్చాపాటి వేసుకునే సావకాశాన్ని కల్పించుకుంటుంది. ఇంతగా ఆవిడ కష్టపడుతున్నా ఆ కుటుంబంలో ఆమెకివ్వాల్సినంత గౌరవం వాళ్లు ఇవ్వటంలేదు. ఆ విషయం ఆవిడకు తెలుసు. అప్పుడప్పుడు ఆవిడ దీనచరిత్ర నీదగ్గర వెళ్లబోసుకుంటుంది కూడాను. అటువంటి సమయం ఏది? ఆవిడ వ్యథిత హృదయం నీముందు విప్పుతుంది చూశావూ. ఆ సమయం ఎంత అమూల్యమయింది మనబోటివారికి. అటువంటి అమూల్యావకాశాన్ని వినియోగించుకునే తెలివితేటలు ఈ నెంబరు టూ (2) నిర్మాణ్యుడికి అవసరం. ఆ సందర్భంలో ఆ హృదయవిదారకమైన దీనచరిత్రకు తనెంతో కలత చెందినట్టు, తన హృదయమంతా సానుభూతితో నిండిపోయినట్టు, సాధ్యమైనంతవరకూ జాలి నటిస్తూ, అవసరంకొద్దీ అడపా తడపా కళ్లు తడి చేసుకుంటూ ఆమెను అనునయించాలి. ఈ ఉపశమన వాక్యాలూ, మనం చూపే సానుభూతితో ఆమెలో మనం కాంక్షించే ఆదరాభిమానాల్ని పొందగలుగుతాం. ఈవిధంగా కొంత సన్నిహితత్వం పెరుగుతుంది. సాధారణంగా అటువంటి వాళ్లు ఎదుటివాళ్ళకి చేతనయినంత సహాయాన్ని చెయ్యటానికి వెనకాడరు. ఎందువల్లనంటే సానుభూతికీ, ఆప్యాయతకీ ముఖం వాచిపోయినవాళ్లు మనకి అర్థించేదానికన్న మనం చూపే బూటకపు నటనకే ఎక్కువ విలువిస్తారు. కాబట్టి అమాత్రం సహాయానికి వాళ్లు విముఖత ప్రదర్శించరు.

కాం: అబ్బ! మీకెంత లోకానుభవం ఉందండీ. నాకు తెలియనే తెలియదు. అయితే నాకొక సందేహం పట్టుకుంది. అలా నటించటం లేనిపోని సానుభూతిని ప్రదర్శించటం పాపం కదండీ.

కా: పాపమేమిటి ఒక విధంగా అతివంచన కూడాను. అయినా సరే గత్యంతరం లేనప్పుడు ఎన్ని బురఖాలన్నా తగిలించుకోవాలి. ఇదేమిటి? ప్రపంచం! అందులో నవీన ప్రపంచం. మునుపట్లా ఇప్పుడు నైతిక విలువలు లేవు. ధర్మం నశించింది. పూర్వం అసత్యమాడటానికి అంతరాత్మ ఎదురు తిరుగుతే హరిశ్చంద్రుడు భార్యాబిడ్డల్ని సహితం దూరం చేసుకోడానికి వెనకాడలేదు! పితృవాక్య పరిపాలనార్థం రాముడు పద్నాలుగేళ్లు వనవాసం చేశాడు! ఆ సత్యసంధత, పితృవాక్య పరిపాలన నిజానికి మెచ్చుకోదగినదే అనుకో. అయితే ఆ రోజులు వేరు. ఇది కలియుగం. ఈ యుగధర్మాలే వేరు. తప్పలేదు. ముందుకడుపునిండాలి. నువ్వు స్వార్థం అను సంకుచితత్వం అను. గత్యంతరం లేనప్పుడు స్వార్థానికీ, సంకుచితత్వానికీ పరిధులు కుంచించుకు పోతాయి. వాటి నిర్వచనాలే

మారిపోతాయి. తెలుసా! ఏమిటనుకున్నావో.

కాం: మీ ధోరణి చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తోంది.

కా. అవును మరి కాబోయే మొగుడంటే ఎవడో ధవ్వాగాడు కాబోలురా అని విచారించి ఉంటావు మనపెళ్లి జరగక ముందు. నే నెవరనుకున్నావు. నివురుగప్పిన నెఱుసును, మసిపూసిన మాణిక్యాన్ని, పేటికాంతర్గత రత్నాన్ని నేను ప్రకాశిస్తే లోకం కళ్లు మిరిమిట్లు గొలుపుతాయి. ఎందుకు అనవసరంగా అని ఊరుకుంటున్నాను. నా నిజస్వరూపం ఇప్పుడు నీకు బోధపడి ఉంటుంది. నువ్వు ఆశ్చర్యపడ్డంలో ఆశ్చర్యం ఏమీ లేదు. (క్షణం ఆగి) ఇప్పుడు చెప్పిందంతా ఒక తరహా వ్యక్తుల్ని గురించి. ఇలా అనేక రకాల మనస్తత్వాలు గల వ్యక్తులుంటారు. మనిషికి మేధస్సుండాలి గాని ప్రపంచాన్ని గుప్పిట్లో అమర్చుకోలేక పోతాడా?

కాం: ఇవ్వాళ మంచిరోజు. ఇవ్వాళే మొదలు పెట్టండి రాయటం.

కా: మంచిరోజేమిటి? ఏరోజు మంచిది కాదు? ఇటువంటి ముసలమ్మ కబుర్లు నా దగ్గిర చెప్పకు. మంచి చెడుగు అన్నది మన మనసుకు సంబంధించినవిషయం. అది కాలానికి ఆపాదించటం మానవుడి దుర్బలత.

కాం: మాటవరసకి అలా అంటారు గాని నిజంగా కాలం మంచిది కాదనా?

కా: కాదు. కాదు. ఇలాంటి అభిప్రాయాలు పెట్టుకుని మొక్కుబడులూ, పూజలూ, పునస్కారాలూ, చేస్తూండే వాళ్ళు అనేకమంది ఉన్నారు. మూఢనమ్మకాలున్న వ్యక్తులు ఇలాంటి బూజుపట్టిన సిద్ధాంతాలతో ఏదో హంగామా చేసి తృప్తి పడుతూంటారు. కాదంటే మీదపడి కరుస్తారు. ఇలా తప్పదారి తొక్కి ఎంత శారీరక మానసిక శ్రమకన్నా ఓర్చి ఎంతెంత డబ్బుని బూడిదలో పొయ్యటానికైనా వెనకాడరు. ఈ ప్రపంచం ఎప్పటికి మారుతుందో కదా?

కాం: ఇంకెంత కాలమో పట్టదులెండి. మీలాంటి వ్యక్తులు రంగంలోకి దూకింతర్వాత ప్రపంచం రంగు మార్చుకుంటుంది.

కా: అధవా మారకపోతే సమాజంలో మానవుడికి సృజనాత్మక శక్తి, స్వయం భరితత్వం లేవన్న మాట. అతణ్ని అగోచరమైన శక్తికి కీలుబొమ్మగా అంగీకరించాల్సి వస్తుంది. అలా ఒప్పుకోను. మానవుడు సాధించలేని దేమిటి? ఈ ప్రపంచంలో ఈ నాగరికత, ఈ హృద్యమయిన సౌందర్యాన్నీ ఎవరు సృష్టించారు. ఈ మేడలూ, మిద్దెలూ...ఇదంతా సృష్టిలో మానవత్వానికున్న ఆధిక్యతని బుజువు చేస్తాయి. కొన్ని కోట్లమంది ప్రాణుల్ని తెగలు తెగలుగా విభజించి వీరందరికీ కూడూగుడ్డా సుఖం, శాంతిలభించటంకోసం పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, సంస్కృతి దృష్ట్యా రాజ్యాంగా చట్టాలు ఏర్పాటు చేసుకునే మేధాశక్తి మానవుడిలో సృజనాత్మక శక్తికి మనకు కనుపించే ప్రత్యక్ష నిదర్శనం. ఓహో! అటువంటి శక్తి సంపన్నుడికి ఈ చిన్నమార్పు అసాధ్యమవుతుందా? అలా ఎప్పటికీ కాదు.

కాం: అయితే మరెప్పుడు ఆరంభిస్తారు?

కా: (ఆవేశంగా) రాస్తాను. వీలైనంత త్వరలో రాయాలని ఉంది. నా జీవితాన్ని పేదలకి అంకితం చేశాను. నా రచనలు కూడా వారికే అంకితం చేస్తాను. శ్లేష్మంలో ఈగల్లా కొట్టుకుంటున్న వారికి మార్గం చూపిస్తాను.

కాం: ఇంతకీ గ్రంధానికి ఏం పేరుపెడతారు? అది చెప్పారు కాదు.

కా: నిజమే నువ్వు చెప్పింది. గ్రంధ రచనంతా ఓ ఎత్తు. పేరుపెట్టటం ఓ ఎత్తు. రచయిత సామర్థ్యం అంతా అక్కడే తేలిపోతుంది; కాబట్టి బాగా ఆలోచించాలి.

కాం: 'శ్లేష్మంలో ఈగలు' అని పెట్టండి.

కా: ఛా! ఛా! అసహ్యం! సందర్భం ఉండొద్దూ? ఔచిత్యం గమనించాలి. ఈనాడు రచయితల్ని అనేకమందిని చూస్తున్నాను. చెప్పేవిషయం దారివేరూ; దానికి పెట్టేపేరూ వేరు. రెంటికి అతకటం లేదు. పేరుపెట్టటం అంటే మాటలా? ఇందాక చెప్పలా రచయిత సామర్థ్యం అంతా అక్కడే తేలిపోతుందని. సరే ప్రస్తుతానికి మన గ్రంధానికి నామకరణం చెయ్యటం విషయం ఆలోచిద్దాం. మన గ్రంధం ద్వారా ప్రపంచానికి కలిగే ప్రయోజనం ఏమిటి? ఋణాలు చెయ్యటంలో ప్రదర్శించవలసిన బుద్ధికుశలత, నేర్పు. అందులో విభిన్నతత్వాలుగల వ్యక్తులనిబట్టి ఈ నటన ఎలా మార్చుకోవాలి? ఇదీ విషయం.

కాం: (అడ్డువస్తూ) అడగటం మరిచాను. అప్పులెలా పుట్టించాలో రాస్తానన్నారు. బాగానే వుంది. చేసిన అప్పుల్ని తీర్చటం ఎలాగో సెలవిచ్చారు కాదు. అప్పుడు గాని మీ కృషి పూర్తిగా సఫలం కాదు.

కా: అని పిచ్చిదానా! అయితే నన్నుత్తి దద్దమ్మకింద కట్టేశావన్నమాట! గ్రంధం పూర్తిచేసి అడుగున రెండవభాగం త్వరలో రానున్నది. మీ కాపీ రిజర్వు చేసుకోండి! అని బ్లాకు లెటర్సులో రాసెయ్యటమే. అప్పటికి గాని ఈ రచనోద్దేశంయొక్క పూర్తిప్రయోజనం ఉండదు. ఇప్పుడు మనం రాసేది మొదటి భాగం మటుకే.

కాం: ఓహో అలాగా! అక్కడితో మీరు బుజం దులుపుకోవచ్చు.

కా: కాదు మరి! సమయం చిక్కాలి. తీరికుండాలి. కాగితంమీద కలం పెట్టానంటే దాని దారి దానిదే. మరింక ఆగమన్నా ఆగదు. అన్నట్టు మరిచాను. ఆరు దాటిందే. ఇప్పుడింకేం బజారు గాని అలా షికారు వెళ్ళొస్తాను. ఇప్పుడే పక్కింటావిడ తీరిగ్గా ఉంటుంది వెళ్లి పట్రా. ఇందాక నే చెప్పిందంతా విన్నావుగా. జ్ఞాపకం ఉంచుకో. బజారు రేపు ఉదయం వెళ్తాలే.

* * *

కా: ఏం? అడిగావా?

కాం: ఆ! మీరు చెప్పినట్టే తు. చ. తప్పకుండా నా సొంత తెలివి కూడా జోడించి మరీ నటించాను ఆవిడ కష్టసుఖాలు వెళ్లబోసుకుంటుంటే ఎప్పుడూ లేంది. కళ్లనీళ్లు కూడా కార్చాను. అబ్బ! పేగులు తెగిపోయాయి సుమండీ...ఇదిగో ఈ చీర చూడండి.

కా: ఆఁ!! అదేమిటి దాన్నిండా ఆ మరక లేమిటి?

కాం: ఆవిడ మనవడు ఏడుస్తుంటే ఎత్తుకుని ఆడించబోయాను చందమామ వేపు చూస్తూ చేతులాడిస్తూ నే ఉచ్చ పోసేశాడు భడవ. పట్టుచీర తడపటానికి వీల్లేదు. లేకుంటే పాడు దుర్వాసన.

కా: (ఆదుర్దాగా) ఇంతకీ పర్యవసానం ఏమయింది?

కాం: ఏముంది. బావిదగ్గర్నుంచి రెండు బిందెల నీళ్లు కూడా మోసుకొచ్చాను. ఆ వెధవ బావి ఓమూల ఏడవకపోతే అందుబాటులో తీయించుకోరూ? ఆ లంకంత పెరడు ఊడ్చేసరికి రెక్కలు ముక్కలయి పోయాయి

కా: అయితే చాలా మెలుకువగా వ్యవహరించావన్న మాట. ఇంతకీ మన పాచిక పారిందందూ.

కాం: (విసుగ్గా) ఆఁ! పారాలి. ఏమిటీ పారేది!

కా: ఆఁ! ఆఁ! అదేమిటి అలా చప్పరించేశావ్.

కాం: కాకపోతే?

కా: ఇంతకీ అది ఏమందో త్వరగా విను.

కాం: చీటికీ మాటికీ ఇలా చేబదుళ్ళంటూ వస్తే మర్యాద దక్కదంది.

కా: అని దీని కడుపుడక!

కాం: ఇదివరకు తీసుకున్న బాపతు పాతబాకీ పదిహేను రూపాయిలూ రెండు రోజుల గడువులో తీర్చకపోతే నానా అల్లరి చేస్తానంది.

కా: చచ్చాన్రా బాబూ! రేపటికి బియ్యం నిండుకున్నాయి. ఎలాగరా దేవుడా?! ★